క్లుప్తంగా

12న పద్మశాలి సంఘం సమావేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయ ఆవరణలో ఈ నెల 12వ తేదీన సిద్దిపేట పట్టణ పద్మశాలి సంఘం సమావేశం నిర్వహించనున్నారు. సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పద్మశాలి పట్టణ ఎన్నికల అధికారి మామిడాల గౌరిమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

'భగీరథ' ట్యాంక్‌ల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లను విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా క్లోరినేషన్‌తోపాటు పలు రికార్డులను పరిశీలించింది. నీరు అపరిశుభ్రం కాకుండా చూసుకోవాలని బృందం ప్రతినిధులు సిబ్బందికి సూచించారు. ప్రజలకు శుభ్రమైన నీటిని అందించాలని చెప్పారు. విజిలెన్స్ క్వాలిటీ బృందం అధికారులు మమత, గోపి, కృష్ణ, ఆర్‌డబ్ల్యూ ఏఈ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు: ఏడీఏ



ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగులో అంతరపంటలు సాగుచేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చిన ఏడీఏ అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని తిగుల్ గ్రామంలో రైతు మల్లేశం సాగుచేసిన ఆయిల్‌పామ్, అంతరపంటైన చిక్కుడు సాగును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్‌లో నాలుగేళ్ల వరకు అంతర పంటలను సాగుచేసుకోవచ్చన్నారు. దానివల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. ప్రస్తుతం ఆయిల్ పామ్ టన్ను ధర రూ.20,500 ఉందని, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు ఖలీల్, కిరణ్, భాను, కృష్ణమూర్తి, కవిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈఓ

సిద్దిపేటజోన్: జిల్లా పరిషత్ పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జెడ్పీ సీఈఓ రమేశ్ మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రామరాజు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్:గజ్వేల్ డివిజన్ తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నవీన్ రాజ్‌కుమార్, యూనియన్ నాయకులు నారాయణ, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న చుక్కారాములు

సిద్దిపేటఅర్బన్: సంగారెడ్డిలో 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభల జయప్రదం చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జీపు జాతను 19న సిద్దిపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నుంచి ప్రారంభించనున్నామని, 25నాటికి సంగారెడ్డికి చేరుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- నూతన డైట్ మెనూను పాటించాలి
- కాంగ్రెస్ పార్టీ నాయకులు



పాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికృష్ణ, అత్తు ఇమామ్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు సంబంధిత గురుకుల క్యాటరింగ్ కాంట్రాక్టర్, ప్రిన్సిపాల్, వార్డెన్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ఆహారం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సౌకర్యాలను కల్పించారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అందరు కృషిచేయాలని కోరారు. డైట్ మెనూ ప్రకారం మంగళవారం విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారం అందించకపోవడంతో వార్డెన్, కాంట్రాక్టర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్, కాంట్రాక్టర్‌లు కావాలనే ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేసేందుకు కుట్రచేస్తున్నారని ఆరోపించారు. కొందరు బీఆర్ఎస్ నాయకులకు తొత్తుల్లాగా వ్యవహరిస్తూన్నారని ఆరోపించారు. అలాంటి అధికారులు, సిబ్బంది, వార్డెన్లు వారి తీరును మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాండు, కలీమొద్దీన్, గయాజొద్దీన్, అక్బర్, బోటా అజ్మత్, చంది రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కవిత, వనజ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిపై 'అన్నపూర్ణ' ముద్ర

- దాతలను మెప్పించి అభివృద్ధి పనులు
- ఆలమంద కోసం గోశాల నిర్మాణం



ఈఓ అన్నపూర్ణకు భూదాన పత్రాలు అందజేస్తున్న దాత(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ప్రముఖ పుణ్యక్షేత్రం నాచగిరి దేవస్థానం ఈఓగా 15నెలలు సేవలందించిన ఎస్.అన్నపూర్ణ మహిళా అధికారిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆమె బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. క్షేత్రంలో మెరుగైన సేవలకోసం కృషి చేశారు. నాచగిరి సహాయ కమిషనర్‌గా 2023 ఆగస్టు 7న విధుల్లో చేరారు. భక్తుల ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తూ పరిష్కారం చూపి మెప్పుపొందారు. గోశాల నిర్మాణం, సరుకులు నిల్వచేసే కోటా గది పునరుద్ధరణ, స్వామివారి వెండి, రాగి డాలర్లు, రక్షాకంకణాలు కొనుగోలు చేసుకునే ఏర్పాటు లాంటి సౌకర్యాలు కల్పించడంలో కృషి చేశారు. అలాగే రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలను 90 శాతం వసూలు చేశారు. రికార్డుస్థాయిలో రూ.1.12 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఆమె సమక్షంలోనే రూ.5కోట్ల విలువైన అర ఎకరం పైచిలుకు పట్టాభూమిని దాతలు ఆలయానికి వితరణ చేశారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెటింగ్ చేయలేకపోయా

నాచగిరిలో చేసిన సేవలు సంతృప్తినిచ్చాయి. ఉద్యోగులు, అర్చకులు ప్రతిపనిలో భాగస్వాములయ్యారు. దాతల సహకారంతో కొన్ని అభివృద్ధిపనులు చేపట్టగలిగాం. నాచగిరి ఆన్‌లైన్, ఆఫ్‌టైం టికెటింగ్ సౌకర్యం కల్పించాలనుకున్నప్పటికీ గ్రామీణ బ్యాంకు విలీన ప్రక్రియతో పూర్తిచేయలేకపోయా. మహిళా అధికారిగా శక్తిమేర సేవలందించానని భావిస్తున్నా.

\- అన్నపూర్ణ (నాచగిరి మాజీ ఈఓ)

పదిలో ఉత్తమ పలితాలే లక్ష్యం

జిల్లా విద్యాశాఖధికారి శ్రీనివాస్ రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ పలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నాలుగైదు సంవత్సరాల నుంచి పది పలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలుస్తోందన్నారు. ఈ యేడాదికూడా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు భూపాల్, శ్రీధర్, రంగారావు, శ్రీనివాస్, రాష్ట్ర విద్యా పరిరక్షణ సిఫార్సుల కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అర్బన్ ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, మండల ఉపాధ్యక్షులు సతీశ్ కుమార్, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని తడ్కపల్లి, ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాల ప్రాంతంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు మంగళవారం పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

నేడు, రేపు శిక్షణ కార్యక్రమం

సిద్దిపేటకమాన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో బుధ, గురువారం ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి మంగళవారం తెలిపారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో పిల్లల కోసం పిల్లల స్నేహపూర్వక న్యాయసేవలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): స్థానిక బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.సతీశ్ తెలిపారు. సంబంధిత పత్రాలతో ఫిబ్రవరి 1వ తేదీలోగా మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, మరింత సమాచారం కోసం గురుకుల పాఠశాలను సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వన్ డే వర్క్ షాప్

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు విద్యా రంగ సమస్యలు, సవాళ్లు, అవకాశాలు అనే అంశాలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు మాట్లాడుతూ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రహీం సుల్తానా, పీఆర్వో రఘు పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన మాక్ పోలింగ్



ఓటు వేయడానికి క్యూ కట్టిన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల బరిలో నిలవగా, మరి కొందరు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా విధులు నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి విద్యార్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మాక్ పోలింగ్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రధాన్యం, ప్రజా ప్రతినిధులను ఎలా ఎన్నుకుంటారనే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికే ఈ మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. హెచ్ఎం స్వప్నారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, స్వప్న, భారతి, లింగం, రాణి, విజయశాంతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ఆదరణ కరువై ఆర్థికంగా చితికిపోతున్న చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలో నూతనంగా ఎన్నికైన నీలకంఠ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడ్డ కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. చేనేతకు ప్రసిద్ధి గాంచిన దుబ్బాకలో కార్మికులను ఆదుకునేందకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. నీలకంఠ సంఘం అధ్యక్షుడు బోడ శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కాల్వ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కాల్వ బ్రహ్మేందర్, సహాయ కార్యదర్శి అక్కల రాజేశ్వర్, కోశాధికారి తుమ్మ దుబ్బరాజంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజమౌళి, ఎల్లారెడ్డి, భూంరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పట్టణ కళ



పోతారం(ఎస్)లో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్

హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. పోతారం(ఎస్), పందిల్ల, జిల్లెలగడ్డ గ్రామాల్లో రహదారిపనులు పూర్తిదశకు చేరుకున్నాయి. డివైడర్‌లు ఏర్పాటుచేసి సెంటర్ లైటింగ్ అమర్చడంతో పల్లెలకు పట్టణ కళ వచ్చింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోతారం(ఎస్) గ్రామం హుస్నాబాద్‌లోనే కలిసిపోవడంతో మున్సిపాల్టీలో విలీనంచేస్తే అభివృద్ధి జరుగుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.

సరస్వతీ శిశుమందిర్‌కు ఎంపీ సాయం

రూ. 25 లక్షల స్టీల్ అందజేసిన రఘునందన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సరస్వతీ శిశుమందిర్ నూతన భవన నిర్మాణానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రూ.25 లక్షల రూపాయల విలువచేసే స్టీల్‌ను అందజేశారని ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్, సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం పాఠశాల నూతన భవనం వద్దకు లారీలలో స్టీల్ చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండున్నర ఎకరాల్లో సుమారు రూ.6.5 కోట్ల బడ్జెట్‌తో నిర్మించ తలపెట్టినటువంటి ఈ భవన నిర్మాణం ప్రస్తుతం పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తయిందన్నారు. దాతలు సహృదయంతో ముందుకు వచ్చి ఇట్టి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. విద్యావేత్తలు, విద్యాభిలాషులు, శిశుమందిర్ పూర్వ విద్యార్థులు ఒకసారి పాఠశాలను సందర్శించి తమ వంతు సహకారం అందించాలని సూచించారు.

కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక/బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి పిరికిపందల చర్య అని ఆ పార్టీ నాయకులు అన్నారు. పలుచోట్ల మంగళవారం విలేకరుల సమావేశాలు నిర్వహించి దాడిని ఖండించారు. సిద్దిపేటలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ గుండాయిజం ఆనవాయితీగా ఉంటుందని ఆరోపించారు. నాయకులు విభీషణ్ రెడ్డి, మార్కండేయులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నామన్న గర్వంతో కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్ యాదవ్, రమేష్‌రెడ్డి, అశోక్, రాజు, భరత్ చారి పాల్గొన్నారు. బెజ్జంకిలో పట్టణ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను ప్రజలు తరమికొడుతారన్నారు. శ్రీనివాస్, నరేశ్, సాయిలు, చంద్రయ్య, సునిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



సిద్దిపేటరూరల్: రాఘవాపూర్ ప్రధానరోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నేతల డిమాండ్
- కొనసాగుతున్న నిరసనలు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల అమలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసనలు మంగళవారం కూడా కొనసాగాయి. పలువురు నేతలు మాట్లాడుతూ ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి యేడాది గడుస్తున్నా వాటిని అమలు చేయలేదని వాపోయారు. రైతులకు బోనస్, రైతుభరోసా, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆరు గ్యారంటీలు వంటివి పూర్తిస్థాయిలో అమలుచేకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



చిన్నకోడూరు: రాజీవ్‌రహదారిపై నేతల రాస్తారోకో



నంగునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్



సిద్దిపేటఅర్బన్: వాహనదారుడికి గులాబీ పువ్వు ఇస్తున్న ఏసీపీ

సిద్దిపేటఅర్బన్: మానవ తప్పిదాల వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పొన్నాల రాజీవ్ రహదారిపై వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. సీటుబెల్టు పెట్టుకోకుండా వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పువ్వులు ఇచ్చి సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ సదాశివరావు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలతోనే ప్రమాదాల నివారణ

చేర్యాల(సిద్దిపేట): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సీఐ ఎల్.శ్రీను పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక అంగడి బజారు చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఒక్క ప్రమాదం కుటుంబాన్ని రోడ్డున పడే అవకాశం ఉంటుందని చెప్పారు. మద్యంసేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం, రాంగ్ రూట్లో వాహనం నడపడం సురక్షితం కాదన్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లోని తూప్రాన్ రోడ్డు మార్గంలోని వై-జంక్షన్ వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఎంవీఐ క్రిస్టోఫర్ వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం, మితిమీరిన వేగం ప్రమాదకరమన్నారు.

గంజాయి మత్తు పదార్థాలపై నిఘా



చేర్యాల(సిద్దిపేట): కళాకారులతో సీఐ శ్రీను

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కళాబృందం సభ్యులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ విజయ్‌భాస్కర్ వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ ముక్కోటి ఏకాదశి కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినం(ముక్కోటి ఏకాదశి)ను పురస్కరించుకొని భద్రాచలం దేవస్థానం నుంచి వచ్చిన కరపత్రాలను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్‌బాబు, కృష్ణాలయం సభ్యులు రామచంద్రం, మైత్రాములు, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

దుబ్బాకటౌన్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని దుబ్బాక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కమలాకర్ అన్నారు. స్థానిక శిశిర పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది వినోద్, నరేందర్, ప్రభాకర్, శ్రీధర్ తదితరులున్నారు.

◆ యంత్రాలతో కూలీల సమస్య దూరం

సిద్దిపేటఅర్బన్: యంత్రాలతో నాట్లు వేయడం ద్వారా కూలీల కొరత సమస్యను అధిగమించవచ్చని మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో వరినాటు యంత్రం ద్వారా నాట్లు వేసిన పొలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రం సాయంతో నాట్లువేస్తే ఖర్చుతగ్గుతుందన్నారు. ఆయన వెంట ఏఈఓ రాజేశ్ ఉన్నారు.

◆ కరాటేలో విద్యార్థుల ప్రతిభ

బెజ్జంకి(సిద్దిపేట): వరంగల్ జిల్లా పరకాలలో జరిగిన కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన కల్లెపెల్లి, గుండారం పాఠశాల విద్యార్థులను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలల్లో అభినందించారు. కల్లెపెల్లి పాఠశాల విద్యార్థి అశ్విత్ గోల్డ్ మెడల్, ఆరాధ్య బ్రాంజ్ మెడల్‌లు, గుండారం విద్యార్థులు అక్షిత గోల్డ్ మెడల్, లావణ్య సిల్వర్, స్పూర్తి బ్రాంజ్ మెడల్‌లు సాధించారు. కోచ్‌లు శ్రీనివాస్, రజిత, వైష్ణవి, హెచ్‌ఎంలు నాగవేణి, భారతి అభినందించారు.

◆ రైతు భరోసా సంబురాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబురాలు జరుపుకున్నారు. ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, కొమ్ము రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబురాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు ఆగంరెడ్డి, కళావతి, చిరంజీవులు, చంద్రయ్య, కిష్టయ్య, లింగం, నరేందర్, సంజీవులు, యాదగిరి, నాగరాజు, శ్రీను, భాను, ఉపేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్యే విమర్శలు అర్థరహితం

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడూ మల్లన్న సాగర్ కాలువల నిర్మాణాలను పట్టించుకోని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం అర్థరహితమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్, జిల్లా కార్యదర్శి ఏలూరు కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. ప్రభుత్వంపై ఎమ్మెల్యే చేస్తున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో నవీన్, యాదవ్, ప్రభాకర్‌చారి, సురేందర్ రెడ్డి, నాగరాజు, యాదగిరి, వెంకట్ పాల్గొన్నారు.

◆ స్టడీ మెటీరియల్ అందజేత

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు హెచ్ఎం నీలం శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్నేహితుల చేయూత

మిరుదొడ్డి(దుబ్బాక): ఇటీవల మృతి చెందిన తమ మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు మంగళవారం ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. మిరుదొడ్డిలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన గొల్ల స్వామి కూతురు పేరిట 2005-26 టెన్త్ బ్యాచ్ స్నేహితులు సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచారు. రూ.41వెయ్యి నగదుతో పాటు, ఖాతా పత్రాలను ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. దేవరాజు, నరేశ్, యాదలింగం, స్వామి, కుమార్, నాగరాజు, పరశురాములు, ప్రసాద్, నర్సింహులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చాలా ముఖ్యం

సిద్దిపేటజోన్: విద్యార్థి దశలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పోలీస్ అధికారులు సూచించారు. మంగళవారం స్థానిక క్రాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు మహిళల చట్టాలు, షీ టీమ్స్ విధులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, ఆకతాయిల వేధింపులు ఉంటే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. త్రీ టౌన్ ఏఎస్ఐ ముజీబ్, షీ టీం ఏఎస్ఐ కిషన్, పాఠశాల చైర్మన్ భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.